శ్రీకాకుళం

# అతడు ఆకలిని జయిస్తున్నాడు

-పెద్దింటి అశోక్‌కుమార్

ఇంటి ముందు పోలీసు జీబు ఆగింది. సివిల్ డ్రెస్సులో ఉన్న నలుగురైదుగురు పోలీసులు దిగిండ్రు. గుండె దడదడ కొట్టుకుంటుంటె బయటకు వచ్చి చూసిండు నర్సింలు. అందరినీ గుర్తుపట్టలేదు కాని ఒకలిద్దరిని గుర్తుపట్టిండు. పత్తి మందు తాగి హాస్పిటల్‌లో ఉన్నప్పుడు చూసిన మొఖాలు అవి.

ససంభ్రమంగా ఇంట్లకు వచ్చారు. ఒకలు మూలకున్న కుర్చీ తెచ్చి ముంగట వేసాడు. చేతుల చిన్న తుపాకి పట్టుకున్న మనిషి కుర్చీలో కాలుమీద కాలేసుకుని కూసున్నడు. మిగిలిన వాళ్లు ఇంట్ల కొందరు, ఇవతల కొందరు నిలబడ్డరు.

నెత్తికున్న రుమాలును దులిపి భుజం మీద వేసుకుని చేతులు కట్టుకుని వండి నిలబడ్డడు నర్సింలు. ఈ పోలీసులు ఇంకొకసారి వస్తే వణికి పోయే వాడే కాని ఈ మధ్య ఎవలెవలో పెద్దపెద్ద ఆఫీసర్లు వస్తున్నరు. తనను పలుకరించి పోతున్నరు. ఇది అలవాటయిపోయింది.

"వారీ... నర్సింలు... బాగున్నావురా" అడిగిండు ఎస్ఐ

"ఏం బాగుండు బాంచెన్... నెత్తిల తిరుగుతుంది. కడుపుల పేగుల వడివెడుతున్నట్టు మంట..." ఇంకేదో చెప్పబోయి తను మాట్లాడుతున్నది అమీన్‌సాబ్‌తోనని గుర్తుకొచ్చి మాటలు మింగిండు నర్సింలు. మాటల అలికిడికి ఇంట్లోంచి బయటకు వచ్చిన నర్సవ్వ తుపాకులను చూసి తలుపుసాటుకు జరిగి మాటలు వింటుంది.

"వారీ... పురుగులు చచ్చేమందు మనుసులు తాగినంక ఎట్లుంటదిరా...? తినే తిండే బుక్కెడు ఎక్కువతింటే కడుపుల ఇముడది. అటువంటిది విషం తాగితే ఎక్కడ ఇముడుతదిరా... నీ అదృష్టం బాగుండి బతికి మందిల కలిసినవు. ఆనాడే సత్తే ఇప్పటివరకు మన్నుల మన్నయిదువు. బొంద మీద గరుక మొలుత్తుండె. అయినా ఉండి సాధించాలె గానీ సచ్చి ఏం సాధిస్తవురా..." ఎస్.ఐ. చెప్పుకుపోతున్నాడు.

నర్సింలు కండ్లల్ల నీళ్లు తిరిగినయి. అందరి మొఖాలు పలుచ పలుచగా కలిసి పోయినట్టు కనిపిస్తున్నయి. బీరిపోయి చూస్తున్నడు నర్సింలు.

"నీ ఒక్కని ప్రాణానికి నువ్వు పోతవు. నీ పిల్లలు ఏ గతి కావాలె. నీ భార్య ఎట్ల బతుకాలె. అప్పులు ఇచ్చినోడు నువు సస్తే మాత్రం అడగడనుకున్నవా...? ఆగితే ఆరు నెలలో యాడాదో ఆగుతడు. తర్వాత ఇచ్చినయి మిత్తితో కట్టమంటడు... అప్పుడు ఎక్కడినుంచి తెస్తరు?..."

ఎస్ఐ చెబుతున్నడు. మాటలు పాపం, పుణ్యం, స్వర్గం, నరకం దాకా సాగినయి. నర్సింలు మాటలేదు. పలుకు లేదు. పిల్లి పట్టిన కోడి లెక్క ముడుచుకుని నిలబడ్డడు.

"చస్తే సమస్యలెప్పుడు తీరవు. బతికి సాధించాలె. నువ్వు దేశానికి తిండిపెట్టెటోనివి. నువ్వు చస్తే దేశమే లేదురా... ప్రభుత్వం నీ వెంట ఉన్నది. అధికారులున్నరు. నీకు భయం లేదు. నువ్వే నలుగురికి ధైర్యం చెప్పాలె. ప్యాట్ల మీటింగు ఉన్నది. ఇక్కడి నుంచి నాలుగైదు ట్రాక్టర్ల నిండా జనం వస్తుండ్రు. నువ్వు గూడా రా. ఎమ్మెల్యే, ఎంపి మిగిలిన అధికారులు వస్తండ్రు. మీలాంటి వాళ్లకు సహాయం చెయ్యడానికే వస్తుండ్రు... తప్పక రావాలె" లేస్తూ అన్నాడు ఎస్ఐ

నర్సింలు చెవులూపిండు. అతడి కండ్లలో ఏదో ఆశ కదిలింది. తలుపు చాటుకున్న నర్సవ్వకు భయం తగ్గింది. బిడియంగా బయటకచ్చింది. జీపు వెళ్లిపోయింది.

"ఏందటా... పోలీసులు ఎందుకో వచ్చిండ్రు?" అడిగింది నర్సవ్వ.

"ఏదో మీటింగు ఉందట రమ్మంటున్నరు."నీరసంగా మంచంలో కూసుంటా అన్నాడు నర్సింలు.

"ఏం మీటింగట" కొంత భయంగా అడిగింది.

"ఏమో... పెద్ద పెద్ద సార్లత్తరట..."

"మీటింగు వద్దు. ఏమద్దు. నువ్వు దవఖానలుండగ నన్ను పరేషాన్ జేసిండ్రు. ఆత్మహత్య నేరం. కేసు బుక్ చేత్తం అని బెదిరిచ్చిండ్రు" నర్సవ్వ కండ్లల్ల నీళ్లు తిరిగినయి.

"అదేం గాదు. రైతులు దివాళ తీసింద్రు గదా! ఏదన్నా సహాయం చేస్తరు. ఇత్తనాలో ఎరువులో ఇస్తరు. ఎద్లనో బర్లనో కొనుక్కొమ్మని పైసలు గూడ ఇత్తరట..." అంటూ కొద్దిసాపేగి "గొల్ల ఎల్లయ్య పెండ్లాంకు లక్ష రూపాలచ్చినయట..." అన్నాడు.

నోట్లో నుంచి మాట బయటకు రానేలేదు. అందుకున్నది నర్సవ్వ. "నీ పైసలిల్లు మునగ. పైసలేం జేత్తయి. పిల్లలకు తండ్రిని తెత్తయా... పెండ్లానికి మొగన్ని తెత్తయా... పైసలు కడుక్కుని తాగుతరా... ఇద్దరు ఆడిపోరగాండ్లున్నరు. వాళ్ల కతలు ఎట్లగావాలె. ఒక్కని ప్రాణానికి సచ్చిండు. ఇక్కడ మూడు పాణాలు సచ్చి బతుకుడు గావట్టె..." తిట్లు అందుకుంది నర్సవ్వ.

ఆమెకు ఎదురు చెప్పే ఓపికలేదు నర్సింలుకు. మంచంలో నీరసంగా వాలిపోయాడు. నర్సవ్వ మాత్రం తిట్టడం ఆపలేదు. ఆ తిట్లు ఎంతసేపు సాగేవో కాని వాకిట్లో ట్రాక్టర్ హారన్ విన్నంక ఆగిపోయాయి.

"నర్సన్నా.... ఉన్నవా... రా పోదాం..." బయట నుంచి పిలుపు.

బయటకు తొంగి చూసింది నర్సవ్వ. ట్రాక్టర్ నిండా జనం. అందరూ రైతులే. అప్పుల పాలైన వాళ్లు... పంటలు చేతికందక చితికి పోయిన వాళ్లు. పీనుగుల్లా పీక్కుపోయిన మొఖాల వాళ్లు. పుట్టెడు బాధలను నెత్తికెత్తుకుని మోస్తున్న వాళ్లు.

వాళ్లను చూస్తేనే భయమేసింది నర్సవ్వకు. 'యాడికత్తడు నర్సన్న... యాడికి రాడు. మీరు పోండ్రి" అన్నది గట్టిగా. సూత్తున్నంత సేపట్లోనే పీనుగులను నిలబెట్టుకుని పోతున్నట్టు రెండు ట్రాక్టర్లు మందిని నింపుకుని పోయినయి.

"గట్లంటవు వదినే... అన్నను రమ్మను. పైసలిత్తరట పైసలు..." ఎవరో గట్టిగా అన్నారు. అప్పటికే అంగి తొడుక్కుని దోతి సింగులను ఎగబెక్కుకుంట బయటకు వచ్చిండు నర్సింలు.

"ఏమన్నగాని. నలుగురితోని నారాయణ... పోయిస్త.. అందరు పోతున్నారు గదా..." భార్యకు చెప్పి ట్రాక్టర్ ఎక్కిండు నర్సింలు.

ట్రాక్టర్ ప్యాటలకు చేరుకుంది. ఒక్కటిగాదు. చాలనే ఉన్నయి. జనం వందల సంఖ్యలో ఉన్నరు. ర్యాలీ అప్పుడే మొదలయింది. ఏవో నినాదాలు. అందరితోపాటు 'గొప్ప వరం.... మహాపాపం... వద్దు వద్దు... ముద్దుముద్దు...' అని గొంతెత్తి అరుస్తున్నడు. ఎవరో అందించిన 'చావుకాదు బతుకు కావాలి' అన్న ప్లే కార్డును పట్టుకున్నాడు నర్సింలు. ఊరంతా తిరిగిన ర్యాలీ స్కూలు గ్రౌండు దగ్గరికి చేరుకుంది. ఎర్రటి ఎండ. ఆయిటి మూనినా మొగులు మీద మచ్చలేదు.

నర్సింలు ఒక మూలకు ఒదిగి కూసున్నడు. మీటింగు మొదలయింది. పాటలు పాడుతున్నరు. పాటలు వింటుంటే కడుపుల పేగులు కదులుతున్నయి.

అప్పుల బాధ తాళలేక రైతన్న....
ఆత్మహత్య చేసుకుంటె రైతన్న...
హాస్పిటల్ పాలైతివ రైతన్న...
నీ అప్పులింక పెరిగిపాయె రైతన్నా....

పాట పాడుతుంటే తన జీవితమే కండ్ల ముందు కదిలింది. నాయకులు ఒక్కొక్కరే మాట్లాడుతున్నరు. ఏదేదో చెప్పుతున్నరు. రైతులు గూడా మాట్లాడుతున్నరు. మైకు నర్సింలు చేతికి అందింది. మాట్లాడాలంటే గొంతు పెగలలేదు. మైకు పక్క వాళ్లకు ఇచ్చి తప్పుకోబోతుంటే ఎవరో వచ్చి రెండంటే రెండే ముచ్చట్లు మాట్లాడమన్నడు.

లేచి నిలబడి 'ఆత్మహత్య పాపం. ఎవలు గూడ సచ్చిపోవద్దు. పిల్లగాండ్లను తండ్రి లేని అనాథలను చెయ్యద్దు. ఏమన్నా బాధలుంటే చెప్పుకోవాలె...' అంటూ ముందుగా బయపడ్డా తర్వాత నాలుగు ముచ్చట్లు బాగానే చెప్పిండు...

మీటింగ్ అయిపోయే ముందు ఎంపి లేసిండు. మాట్లాడుతూ మాట్లాడుతూ ".... గ్రామగ్రామాన హెల్ప్‌లైన్లు పెట్టినం. మీకు సహాయం చేస్తం. తొందరపడి ఆత్మహత్యలు చేసుకోవద్దు. రైతులంతా మీ అప్పుల వివరాలు మీ కార్యదర్శులకు రాసి ఇవ్వండి. కార్యదర్శులు ఎం.ఆర్.వోకు ఆ వివరాలు అందిస్తరు. మీకు

అప్పుల వాళ్ల నుంచి బాధలేకుండా చేస్తం..." చప్పట్లు మోత మోగినయి. ఆ మోతలోనే బ్యాంకు రుణాల గురించి చెప్పిండు.

నర్సింలుకు ఒక్కసారి ఎగిరి గంతులెయ్యాలనిపించింది. మీటింగ్ అయిపోగానే పులిహోర పొట్లం మిస్తే తిని నీళ్లు తాగి ట్రాక్టర్‌ల ఎక్కికూసున్నడు. అర్ధగంటల ఇంటికి చేరుకున్నడు.

నర్సవ్వ తిండి గూడ తినలేదు. భర్త కొరకు ఎదురు చూస్తూ కూసున్నది. ఏం మీటింగో... ఏం కతనో అని ఆమెకు భయం. ఈ మధ్య భర్తను ఒంటిగా ఇడిసి పెట్టాలంటనే భయం. రెండు నెలల నుంచి ఎక్కడ బెంగటిల్లుతడోనని వెంటనే ఉంది. ఆ ఒక్క రోజు ఏదో పని మీద ఊరికి పోయింది. అంతే! అటు ఊరికి పోయిందో లేదో ఫోన్ అందనే అందింది. నెత్తి నోరు మొత్తుకుంట ఉరికొచ్చింది.

నర్సింలు వస్తవస్తనే కండ్లకు నీళ్లు తీసుకున్నడు. బడి నుంచి వచ్చిన కొడుకును బిడ్డను దగ్గరికి తీసుకున్నడు. మొఖం కొద్దిగ తెలివిల పడింది. మాట తీరే మారింది. అన్నం తినకుంట మీటింగ్ ముచ్చట్లన్ని చెప్పిండు. చెబుతూ చెబుతూ బాకీలన్నీ రాసి ఇయ్యమన్నరని గూడ చెప్పిండు. బ్యాంకుల బాకీ ఉన్న పైసలు గూడ అడుగకుంట చేస్తనన్నడని చెప్పిండు.

"మన బాకీల సంగతి వాళ్లకు ఎందుకట?" అర్థం కాక అడిగింది నర్సవ్వ. నర్సింలు విచిత్రంగా చూసి "ఎందుకంటే ఏంటిదట నీ కత. ఏదన్నా లోన్ ఇత్తరు. కొంతనో కొంత బాకీ కట్టుకొమ్మంటరు. ఇంకేదన్నా చేస్తరు" అన్నడు.

"ఆ... గట్లనే అంటరు తియ్యి. వాడచ్చి రానుకుపోతడు. నేను నూత్త'' అన్నది చెయ్యికడుక్కుంట. నర్సింలు గూడా లేచిండు. కాయిదం పెన్ను అందుకున్నడు. పేరుపేరునా పద్దులన్నీ రాసుకున్నడు. లక్ష యాభై దాటింది. దవాఖాన్ల ఉన్నప్పుడు చేతుల మీద బదలు తెచ్చినయి ముప్పయి దాక ఉన్నయి. అవి గూడ రాసిండు. కరంటు బకాయి. కిరానం ఖాత, ఎరువుల ఖాత పైస పైసకు రాస్తే రెండు నిండినయి.

ఉన్నది రెండెకురాలు చేను. ఐదేండ్ల కిందటి వరకు అప్పులేదు. తన చేతులకునే నిలువ ఉన్నయి. తనే బాకీ ఇచ్చిండు. అప్పుడు వానలు పడ్డయి. ఆబితాబి రెండు పంటలు. ఎప్పుడైతే కరువు మొదలయిందో అప్పుడే అప్పులు మొదలయినయి. మిత్తికి మిత్తి మిత్తికి మిత్తి ఐదేండ్లల్ల రెండు నిండినయి.

ఆ రాత్రి నర్సింలుకు నిద్ర పట్టలేదు. గతమంతా మనసులో మెదిలింది. నాలుగు మెతుకులు దానం చేసే చెయ్యి ఇప్పుడు బుక్కెడు బువ్వకోసం చెయ్యిసాపుతుంది. ఎట్లా జరిగిందో ఏమి జరిగిందో తెలువది. కాలం గుంజుకుంది.బోర్ల మీద బోర్లు. బోర్ల పడ్డ బోరు బతుకును బోర్లేసింది. భూమిల తడి లేదు. బతుకుల తడిలేదు. కండ్లల్ల తడి మిగిలింది. ఖర్చులు తప్పలేదు. పంట చేతికి అందలేదు.

తెల్లారింది. ఎన్నడూ లేనిది మబ్బుతోనే లేచి తానం జేసిండు నర్సింలు. దేవుని పోటువ తుడిచి ఊదుబత్తి ముట్టిచ్చి మొక్కిండు. భర్తను అట్లా చూసినంక నర్సవ్వకు కడుపు నిండినట్టయింది. పొయ్యి మీద ఎసరుపెట్టి చాట, తవ్వ చేతులు పట్టుకున్నంక డబ్బుల బియ్యం నిండుకున్నయని యాదికచ్చింది.

"బియ్యం నిండుకున్నయి. వచ్చే పోయి ఇల్లు. కింటలన్న ఏపియ్యాలె..." డబ్బ దులుపుతూ అన్నది. అట్లా చెప్పడానికి ఇష్టం లేదు. అయినా తప్పది. ఖచ్చితంగా తేవాలని కాకుండా మాట వరుసకు అన్నట్టుగా అన్నది.

"తెచ్చుడు కచ్చినాది... మస్తుతేవచ్చు. తేర్పంగ ఉంది కత. ఏనుగెత్తు అప్పుజేసి ఏకుల గుల్లతో తీర్చినట్టుంది. ఇచ్చినా ఇయ్యకపోయినా పతారకైతే కొట్టులేదు. అప్పు పుట్టదన్న భయం లేదు" అన్నడు నర్సింలు నవ్వుతూ.

"మన నీతి మనను ఆదుకుంటుంది. ఆ పతార లేకుంటే ఇప్పటికి బొంద మీద గరక మొలుత్తుండే.... దవాఖాన్ల ఉన్నప్పుడు... మాట మీదనే పైసలచ్చినయి..." నర్సవ్వ చెబుతుంది.

పిలుపు విని ఇద్దరి మాటలు ఆగిపోయినయి.

''ఎవలో వచ్చిండ్రు నూడు. మందు

తాగుడేందో గాని మంది వచ్చుడు ఆగుత లేదు" అన్నడు నర్సింలు నవ్వుతూ. భర్త వైపు కోపంగా చూసి బయటకు తొంగి చూసింది నర్సవ్వ. బయట సుంకరి లింగం.

"నర్సింలు లేడవ్వా? కార్యదర్శి రమ్మంటండు. ఎవలో సార్లు వచ్చింన్రట" సుంకరి. "ఆ...ఏందిర లింగం... వత్తన్న ఎవలచ్చింన్రురా..." బయటకు వస్తూ అన్నాడు నర్సింలు.

"ఎం.ఆర్.వో. ఎండివో గిర్‌దవారీ" అంటూ వచ్చిన అధికారుల పేర్లు చెప్పిండు లింగం. ఆదరబాదర గ్రామ పంచాది దగ్గరికి నడిచిండు నర్సింలు.

అప్పటికే అక్కడ జనం జమయింన్రు. మీద మీదవడి పేర్లు రాయించుకుంటున్నరు. నర్సింలు అప్పుల వివరాలన్నీ రాసి ఇచ్చిండు. అందరి కండ్లల్ల కొండంత ఆశ. కొత్తగా లోన్లు ఇస్తరట అని కొందరు. పైసలే ఇస్తరట అని కొందరు. కాదు. బాకీలన్నీ కడుతరట అని కొందరు. రకరకాలుగా అనుకుంటున్నరు.

అధికారులందరూ నర్సింలును పేరు పెట్టి పిలవడం... ఏదేదో రాసుకోవడం, సంతకాలు తీసుకోవడం, భుజం తట్టడం చూసి అందరూ 'నర్సిమ్మని' పంట పండిందిరా.... వానికి ఏదో చేస్తరనుకున్నరు. నర్సింలు గూడా అట్లనే అనుకున్నడు. ఇంటికి వచ్చి భార్యతోని చెప్పుకున్నడు. నర్సవ్వకు గూడ ఆశ పుట్టింది. పైకి మాత్రం 'నాలుగు వానలు పడి పంటలు పండాలెగని వాళ్లు కండ్లు తుడిత్తే కడుపు నిండుతదా' అన్నది.

"అట్ల పంటలు పండితే ఈ గతి ఎందుకు పడుతుండె... ఎదురు సూపులు ఎందుకుండు?" అన్నడు బాధగా నర్సింలు.

ఆనాడు రాత్రి ఊర్లె చాటింపు వేసింన్రు. గవర్నమెంటు మారిటోరియం ఇచ్చిందని ఆరు నెలల వరకు ఎవరూ ఎవరిని బాకీ అడుగవద్దని, అడిగితే కేసులు తప్పవని. ప్రత్యేకంగా హెల్ప్‌లైన్‌లో అప్పులున్నాయని రైతులు ఎవరి పేర్లనైతే ఇచ్చింన్రో వాళ్లకు సుంకర్ల ద్వారా అప్పులు అడగవద్దని సమాచారం చేరింది. ఒకసారిగా ఊరు ఉల్కిపడ్డది. అప్పుల ఇచ్చే వాళ్లు ఆగిపోయింన్రు. ఉద్దెరఖాతాలు మూతవడ్డయి. అందరికి మామూలుగా తెల్లారినా కొందరికి నిద్రలేని రాత్రయింది.

తెల్లారి బియ్యం కోసం దుకాణంలకు పోయిండు నర్సింలు. రెండు మూడు వందలు అడుక్కొని దవాఖాన్లకు పోవాలనుకున్నడు. చేతి బదలు అడుక్కున్న కొన్ని బాకీలు సేటును అడిగి తీర్చాలనుకున్నడు. కానీ మొదటనే ఎదురు దెబ్బ తగిలింది. బియ్యమే దొరుకయన్నడు సేటు.

"లేకుంటే నీ ఇంట్లో ఉన్నయి ఇయ్యి. నాకు అసలే లెవ్వు" చనువుగా అన్నడు నర్సింలు.

"ఇత్త... ఇత్త.. అడ్డగోలు అప్పులు జేసి అడిగితే

## హైకూలు

గాలి కదిలిందా
కత్తులు ఝళిపిస్తోంది
కొబ్బరిమట్ట!

చిమ్ము కెళ్తోంది
కారు వర్షపు రోడ్డును
నీటి రెక్కల్తో!

ఈదే బర్రెను
నీటిగుర్రం చేశాడు
పిల్లాడు పైకెక్కి!

చెత్తకుండీలో
ఎంత దేవినా దొరకట్లేదు
అనాథ బాల్యం!!

పిల్లల్ని మోస్తూ
వెళ్తోంది స్కూలు బస్సు
భారీ ప్రయాణం!

టీవీ ముందున్న
బొమ్మల్లో కదలిక
కరెంట్ పోయింది!

వెలుగు నీడల్తో
కొట్టుకు లాడుతోంది
పాడైన స్ట్రీట్ లైట్!

-గేరా

పోలీసులకు చెప్పుండ్రి. బియ్యం లెవ్వు దయ్యం లెవ్వు... "కోపంగా అన్నడు సేటు, నర్సింలు పాణం జల్లుమంది. తననేనా కాదా అన్నట్టు చూసిండు. తననే అని తెలిసినంక క్షణం కూడా నిలువ బుద్ధి కాలేదు. తల కొట్టేసినట్టయింది. మనసు బాధతో నిండి పోయింది.

వెనక్కి తిరిగి ఇంటి మొఖం పట్టిండు నర్సింలు... తొవ్వలోనే ఎదురయిండు కిషన్‌రెడ్డి. నర్సింలును చూడగానే ఆగిండు. నర్సింలు గూడా నిలబడి 'మామా.. ఎటు వోతున్నవు..?" అని అడిగిండు.

"నీ మామ పీసునె గొడుదు... మామా మామ అని మామకు కామ పెట్టినవు గదా! నీను నీ లెక్క మాటకు గతిలేనోడినే గదా! ఏదో ఆపదలున్నవని నా బాకీలను ఆపుకుని నీకు బాకీ ఇత్తిని. ఇప్పుడు నిన్ను అడగబోతే భయమాయె. నేను అప్పన్నోడు ఊకుండడాయె. ఈకత ఎట్ల నడువాలె" అన్నాడు కోపంగా.

"ఎవల బాకీ ఎగవెట్ట మామా... అందరియి తీర్పుకత్త. కొద్దిగ చెయ్యి తిరుగని... మాట పెకల లేదు. బలవంతంగా మాట్లాడుతుంటే మధ్యలోనే అందుకున్నడు కిషన్ రెడ్డి. "ఏం తీర్పుతవు. వాడు ఎగవెట్టుమనే చెప్పవట్టె. అడిగితే కేసులు పెడుతమనవట్టె. నిన్ను అప్పు అడిగితే బతుకు దెరువు ఉన్నదా..." ఇంకేదో అంటున్నడు.

నర్సింలుకు కోపం రాలేదు. బాధగా అనిపించింది. భయంగా అనిపించింది. ఎవలతో మాట పడింది లేదు. ఎవలనూ మాట అన్నది లేదు. ఇంతవరకు చెప్పు కాలు ఇంట్లకు అడుగు పెట్టలేదు. అప్పు అడిగిన వాడు లేదు. సంసారం మాటమీదనే నడిచింది. ఇప్పుడు మాత్రం బజార్ల వడ్డట్టయింది.

కిషన్‌రెడ్డి తిడుతున్నా విననట్టే ముందుకు నడిచిండు నర్సింలు. నడుస్తుంటే అందరూ తననే చూస్తున్నట్టుగా అనిపిస్తుంది. తన గురించే మాట్లాడుకుంటున్నట్టుగా అనిపించింది. ఎట్ల నడిచిండో... ఇంటికి ఎట్ల చేరుకున్నడో తెలువలేదు. నర్సవ్వ మాట్లాడినా మాట్లాడక మంచంలో ఒరిగిపోయిండు.

అతడి మొఖం వాలకం చూసి ఏదో జరిగిందని అర్థం చేసుకుంది నర్సవ్వ. పట్టి పట్టి మాట్లాడింది. నర్సింలు పొడిపొడిగా సమాధానం చెప్పిండు. ఏం జరిగిందో తెలుసుకుందామని ఊర్లెకు వచ్చింది. ఎదురైన వాళ్లు ఎదురైనట్టు ఏదో అంటుంటే నర్సవ్వకు విషయం పూర్తిగా అర్థమయింది. బజార్ల నిలువాలంటనే భయమేసింది. అందరూ ఆదుకున్న వాల్లే. అందరూ తనలాంటి బతుకులున్న వాల్లే. ఇంటికి వచ్చి తనూ ఒక మంచంలో వాలిపోయింది నర్సవ్వ.

"చూసినవా... మనుషులు ఎంత భయంల పడ్డరో... ఈ మారిటోరియమని చెప్పక పోయినా ఇచ్చేటోడు ఇత్తుండె. ఆగేటోడు ఆగుతుండె. ఇప్పుడు అప్పు పుట్టకుంటాయె. ఇచ్చేటోడు తిట్టుకునుడాయె.. '' ఏ అర్థరాత్రో కలువరిత్తున్నట్టుగా అన్నడు నర్సింలు.

"ఏమో... గవురుమెంటు ఎదన్న ఇయ్యదా... సూత్తాం. కండ్లు తీసిన దేవుడు ఇండ్లు సూపియ్యడా?" ధైర్యం చెప్పింది నర్సవ్వ.

నెలా రెండు నెలలు గడిచింది. అప్పుడప్పుడూ ఇంటికి వచ్చే అధికారులు కనబడ లేదు. వర్షాలు గూడా లెవ్వు. ఎదురు చూసి చూసి అటు వానల మీద ఇటు మనుసుల మీద నమ్మకం పోయింది నర్సింలుకు. ఊర్లె నయాపైస అప్పు పుట్టకుంట అయింది. పాపమన్న వాళ్లే పగవట్టి చూస్తున్నరు.

ఇంకో వారానికో పది రోజులకో సబ్సిడీ అంటూ విత్తనాలచ్చినియి. వాటిని తీసుకోలేదు నర్సింలు. లేక లేక పెద్ద వాన పడ్డది. అందరు దుక్కులు దున్నుతున్నరు. నర్సింలు దుక్కిమొఖం చూడలేదు.

'ఏ పని చేసినా ఇప్పుడు వెయిల ఖర్చుగావాలె. లాగోడిగావాలె. వానగొట్టె ఎట్లా' నర్సవ్వ తొక్కులాడుతుంది. నర్సింలు మాత్రం నోరు తెరుత్తలేదు.

అన్నికాలాలందు... అన్ని వ్యవస్థలందు... అన్ని సమస్యలకు మూల కారణం ఆకలి అని గుర్తించినంక... తనను అవహాస్యం చేసినందుకు... ఆకలిని తీర్చే అతడు ఇప్పుడు ఆకలిని జయిస్తున్నాడు. ■